కథా నిలయం
4569
శ్రీకాకుళం

# ప్రళయాగ్ని

అమెరికాలో వేల సంఖ్యలో భారతీయ శాస్త్రజ్ఞులున్నారు. వారిలో గణనీయమైన సంఖ్యలో ఆంధ్రప్రదేశ్‌కి చెందినవారున్నారు. అమెరికాలో మన శాస్త్రవేత్తలకి మంచి పేరూ, గౌరవమూ, గుర్తింపూ ఉన్నాయి. వారు తెలివిగల వారనీ, కష్టించి పనిచేస్తారనీ ప్రతీతి.

డాక్టర్ కెనడీ అమెరికాలో మంచి పేరున్న జియోఫిసిస్ట్. ఆ రోజు రాత్రి ఆయన తన సొంత లేబొరేటరీలో ఏవో శిలలను పరిశోధిస్తున్నాడు. ఆ పరిశోధన ఎంతో ఆసక్తికరంగా ఉండడంతో అర్ధరాత్రి రెండు గంటలైనా కాలం సంగతి మరిచిపోయాడు.

ఉన్నట్లుండి ఆకాశంలో పెద్ద వెలుగు, దానినంటి జుయ్యిమంటున్న శబ్దమూ వినిపించాయి. కిటికీలో నుంచి వచ్చిన ఆ వెలుగుతో ఆయన గది పట్టపగలుగా మారిపోయింది. వెంటనే ఆయన బాల్కనీలోకి వచ్చి చూశాడు. దగ్గరలో ఉన్న గుట్ట వెనకాల అతి కాంతిమంతమైన ఉల్క ఒకటి రాలిపోతూ కనిపించింది. అది నేలను తాకగానే పెద్ద చప్పుడూ, ఆ వెంటనే ఉవ్వెత్తుగా ఎగిసిన మంటలూ కనిపించాయి. ఆ ఉల్క అక్కడికి దగ్గరలోనే ఉన్న గుట్ట వెనుక పడ్డట్లు గమనించాడు.

మర్నాడు ప్రొద్దున్నే డాక్టర్ కెన్నడీ ఆ ప్రాంతానికి వెళ్ళాడు. ఆ ఉల్కా పాతం వల్ల ఏర్పడ్డ గోతిని సులువుగానే గుర్తించాడు. అది సుమారు ఇరవై అడుగుల లోతు, ముప్పది అడుగుల కైవారంతో గరాటు ఆకారంలో ఏర్పడింది. ఆ దగ్గరల్లోని తుప్పలూ, దుబ్బులూ ఆ వేడికి మాడిపోయాయి. ఆ ఉల్క ఏమంత పెద్దదయి ఉండకపోవచ్చు. అందుకనే సూటిగా నేలలో బాగాలోతుగా దిగిపోయి ఉంటుంది. అందువల్ల ఎంత వెదికినా అది కనిపించలేదు.

ఆ గోయి చుట్టూ లేచిన మట్టినీ, మాడిపోయిన మొక్కల్నీ పరీక్షిస్తుంటే ఒకచోట మట్టిలోనించి ఏదో తళుక్కుమంటూ కనిపించింది. కోడిగ్రుడ్డు పరిమాణంలో ఇంచుమించు గుండ్రని ఆకారంలో ఉన్న ఆ శిలను బయటికి తీసి పరీక్షించాడు డాక్టర్ కెనెడీ. అది ఆ ఉల్కలోభాగం కాని, లేదా దానితోపాటు వచ్చిగాని ఉండాలి. అదీగాకపోతే అమిత ఉష్ణంతో మండుతూ వచ్చిన ఆ ఉల్కవేడికి అక్కడి నేలలోని పదార్థం ఏదైనా అలా మారిపోయి ఉండాలి. అటువంటి శిలలు వేరే ఏమైనా అక్కడ దొరుకుతాయేమోనని



జాగ్రత్తగా వెతికాడు, కాని అటువంటివేమీ కనిపించలేదు. వెంటనే ఆ శిలను ఒక గుడ్డలో చుట్టి ఆ మూటను తన కిట్‌లో పెట్టుకుని తిరిగి తన లేబొరేటరీకి చేరుకున్నాడు డాక్టర్ కెనెడీ.

లేబొరేటరీకి చేరగానే ఆ శిలపై ప్రాథమిక పరీక్షలు జరిపాడు ఆయన. ఆ శిల బరువు మామూలు గ్రానైట్ శిలకంటే ఎక్కువగా ఉంది. కార్బన్ అమిత ఒత్తిడికి, ఉష్ణానికీ గురి అయితే వజ్రంగా మారుతుంది. ఇది కూడా వజ్రం కాదు కదా అని పరిశోధించాడు. వజ్రం అయితే ఇంకా ఎక్కువ బరువు ఉంటుంది. పైగా కోతకోయక ముందు వజ్రానికి ప్రత్యేకమైన ప్రకాశం ఉండదు. అదీగాక వజ్రం కొన్ని కోణాలలోనే ప్రకాశిస్తుంది. కాని ఇది స్వయంప్రకాశంగా ఉంది. ఎండలో దాని కాంతి కనపించడం లేదుగానీ ఏ కొంచెం నీడలోనైనా, చీకటిలోనైనా అది ఎంతో ప్రకాశమానం అవుతోంది. అయితే ఆ ప్రసారం కిరణాల రూపంలోకాక పల్చగా వ్యాపించినట్లు ఇంకా సరిగ్గా చెప్పాలంటే పౌర్ణమి వెన్నెలలాగా, మబ్బులలో నుంచి వచ్చే సూర్యకాంతి లాగా ఉంది. అటువంటి లక్షణాలున్న శిలను డాక్టర్ కెన్నెడీ అంతకుముందెప్పుడూ చూడలేదు. అసలు అది భూమికి సంబంధించిన దేనినీ పోలి ఉన్నట్లనిపించడంలేదు. వేరే పనులు ఉండడంతో అప్పటికి ఆ పరిశోధన ఆపి దానిని జాగ్రత్తగా గుడ్డలో చుట్టి ఆ మూటని అల్మారాలో పెట్టి తాళం వేశాడు ఆయన.

* * * *

మర్నాడు తిరిగి ఆ శిలను పరిశోధించడం మొదలుపెట్టాడు డాక్టర్ కెనెడీ. ముందుగా దానిని

వివిధ కోణాలలో ఫోటోలుతీశాడు. ఆ తర్వాత ఆ ఫిల్మ్‌ను డెవలప్ చేస్తూ దిగ్భ్రాంతి చెందాడు. ఎందుకంటే అప్పటికే ఆ సరికొత్త ఫిల్మ్ పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయి వుంది. అలా ఎందుకు జరిగిందో వెంటనే ఆయనకు అర్థంకాలేదు.

తర్వాత అల్మారాలోనుంచి మరో కొత్త ఫిలింతీశాడు. దాంతో మళ్ళీ వేరే ఫిల్మ్‌తో ఫోటోలు తీసి డెవలప్ చేయబోయాడు. ఈసారి ఆయనకి మతిపోయినట్లయింది. ఈ ఫిల్మ్‌కూడా పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయింది. జాగ్రత్తగా ఆలోచించేసరికి ఆ కల్‌ప్రిట్, ఆ అసలు నేరస్తుడు ఆ విచిత్ర శిలేనని బోధపడింది.

డాక్టర్ కెనెడీ కొత్త ఫిలిం రోల్‌వున్న కిట్‌లోనే ఆ శిలను కూడా వేశాడు. దానిని గుడ్డలో బాగాచుట్టినా, దాని రేడియేషన్ మూలంగా ఆ ఫోటో ఫిల్మ్ ఎక్స్‌పోజ్ అయిపోయింది. తర్వాత అల్మారాలో పై అరలో చెక్కపెట్టెలో గుడ్డమూటలో ఆ శిలను ఉంచాడు. అదే అల్మారాలో అట్టడుగు అరలో బ్రీఫ్‌కేస్‌లో ఫోటో ఫిల్మ్‌లున్నాయి. అయినప్పటికీ వాటిలోంచి తీసిన ఫిల్మ్‌కూడా పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయిందంటే ఆ శిలనుంచి అమిత శక్తిమంతమైన రేడియేషన్ వస్తోందన్న మాట. తన అనుమాన నివృత్తికోసం అల్మారాలో ఉన్న మిగతా ఫిల్మ్‌లను కూడా డెవలప్‌చేసి చూశాడు డాక్టర్ కెనెడీ. ఆయన ఊహించినట్లే అవన్నీ కూడా పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయి ఉన్నాయి. ఆ తర్వాత ఆ శిలనుంచి వస్తున్న రేడియేషన్ స్థాయిని తెలుసుకోవడానికి కొన్ని ప్రయోగాలు చేశాడు డాక్టర్ కెనెడీ. అవి సంభ్రమాన్ని కల్పించే ఫలితాలను ఇచ్చాయి.

అతి తీవ్రమైన యురేనియం రేడియేషన్‌ను కూడా సీసం హరించి వేస్తుంది. అందువల్ల గట్టి మందమైన సీసపు గోడలుగల కేస్‌లో ఈ శిలను ఉంచి ఫిలింపై ఎక్స్‌పోజ్ చేశాడు డాక్టర్ కెనెడీ. అయినా ఆ ఫిలిం పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయింది. ఇనుము, గోడలు, చెక్కవంటి వేవీకూడా ఆ రేడియేషన్‌ని ఆపలేకపోయాయి.

తర్వాత ఆ శిలను తీసుకుని డార్క్‌రూంలో ఉంచాడు డాక్టర్ కెనెడీ. దానినుంచి కళ్ళుమిరుమిట్లు గొలిపే కాంతివచ్చింది. ఎక్స్‌రేస్ వంటివి తీక్షణమైన కిరణాలు కంటికి కనిపించవు. కాని ఈ విచిత్ర శిల ఒకప్రక్క తీక్షణమైన రేడియేషన్‌ని విడుదల చేస్తూనే మరోవంక కనిపించే కాంతిని కూడా వెదజల్లుతోంది.

ఆ తర్వాత ఆ శిలనుంచి వచ్చే కాంతిని, రేడియేషన్‌నీ స్పెక్ట్రాగ్రాఫ్ ద్వారా పరీక్షించాడు డాక్టర్ కెనెడీ. విజిబుల్ బాండ్‌లో అంతటి తీక్షణమైన రేడియేషన్‌ని ఇంతకు ముందెవరూ గుర్తించలేదు. అలాగే అది ఏర్పరచిన లైన్లు శాస్త్రవేత్తలకు తెలిసిన ఏ స్పెక్ట్రంలోనూ లేవు. అవి ఇన్‌ఫ్రారెడ్ బాండ్‌కి ఆవలగా వున్నాయి.

డాక్టర్ కెనెడీ ఆ శిలమీద మరికొన్ని పరిశోధనలు చేశాడు అవి మరింత విభ్రాంతికరంగా ఉన్నాయి. యురేనియం ధాతువు రేడియేషన్‌ను విడుదల చేస్తూ డికేఅవుతుంటుంది. కాని ఈ శిలలో పదార్థం తరిగిపోయేటట్లు లేదు. దానిని ఎండలో వుంచితే సూర్యునినుంచి వచ్చే ప్రసారాన్ని తనలో హరించుకుంటోంది. సాట్యురేషన్ పాయింట్ రీచ్ అయాక తిరిగి ఆ ప్రసారాన్ని విడుదల చేస్తోంది.

ఆ శిలా లక్షణాలను గమనించిన డాక్టర్ కెనెడీకి ఒక ఆలోచన వచ్చింది. బలహీనంగా వుండే సన్నని దారాన్ని కలిపి పేనితే గట్టి త్రాడు ఏర్పడుతుంది. అలాగేకాంతి కిరణాలను పేనినట్లుగా చేసి లేజర్ కిరణాలను సృష్టిస్తారు. ఇవి అమిత శక్తిమంతమైనవి. శక్తి ప్రసారంలో ఆల్ఫా, గామా, కాస్మిక్ వంటి

కిరణాలు అమిత శక్తిమంతమైనవి. వీటిని లేజర్ కిరణాలుగా మారిస్తే అవి ఊహకందనంతటి శక్తిగలవవుతాయి. లేజర్ కిరణాల ఉత్పత్తిలో 'రుబీ' (కెంపు) ప్రధానపాత్ర వహిస్తుంది. ఇప్పుడు కనుగొన్న శిల ద్వారా ఇట్టి లేజర్ కిరణాలను ఉత్పత్తి చేయవచ్చుననిపించింది డాక్టర్ కెనెడీకి. ఆయన అంచనాప్రకారం కేవలం ఒక్క కిలోగ్రాం శిలా పదార్థంతో మొత్తం అమెరికా ఖండపు శక్తి అవసరాలను ఎన్నో దశాబ్దాలపాటు తీర్చవచ్చు. అది జరగాలంటే అసలు ఆ శిలలోని పదార్థం ఏమిటో, దాని లక్షణాలేమిటో స్పష్టంగా తెలియాలి. అప్పుడు అట్టి పదార్థాల్ని ఉత్పత్తిచేయడం సాధ్యమవుతుంది. అయితే ఇందుకు తనొక్కడి కృషి చాలదనిపించింది డాక్టర్ కెనెడీకి. అమెరికాలోని నాసా కేంద్రంలో న్యూక్లియర్ ఫిసిస్ట్‌గా పరిశోధనలు జరుపుతున్న భారతీయుడు డాక్టర్ రంగనాథ్ సహాయం తీసుకోడం మంచిదనిపించింది. పైగా ఆయన డాక్టర్ కెనెడీకి ఆప్తమిత్రుడు కూడా.

ఆ మర్నాడే డాక్టర్ రంగనాథ్ దగ్గరకి వెళ్ళాడు డాక్టర్ కెనెడీ. తాను కనుగొన్న శిల విషయం చెప్పి, ఒక్కసారి తన లేబొరేటరీకి వచ్చి దానిని పరీక్షించమని కోరాడు.

డాక్టర్ కెనెడీ చెప్పిన విషయాలు విని విస్తుపోయాడు డాక్టర్ రంగనాథ్. వారం రోజుల తర్వాత తప్పక వస్తానని మాట ఇచ్చాడు ఈ లోగానే వెళ్ళాలని అతని మనసు ఎంతగా ఆరాటపడ్తున్నా పనుల ఒత్తిడితో సాధ్యంకాలేదు.

* * * *

వారం రోజులు గడిచాయి.

ఆ మర్నాడే డాక్టర్ కెనెడీ లేబొరేటరీకి వెళ్ళాలనుకున్నాడు డాక్టర్ రంగనాథ్.

ఆ రాత్రి భోజనం అయ్యాక రాగింగ్ ఛైర్‌లో ఊగుతూ ఏదో ఆలోచిస్తున్నాడు. ఉన్నట్లుండి బొయ్యిమంటూ ప్రమాద హెచ్చరిక చేస్తూ సైరన్‌కూత వినిపించింది. ఆ విధమైన హెచ్చరిక వస్తే వివరాల కోసం రేడియోనో, టి.వి.నో ఆన్ చేసుకోవాలి. ఇదిగాక పోలీసులు వ్యాన్‌లలో తిరుగుతూ మైకులద్వారా ప్రజలను హెచ్చరిస్తుంటారు. అనుకోని ప్రమాదం ఏర్పడినప్పుడు ప్రజల్ని అప్రమత్తుల్ని చేయడానికి అమెరికా ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లనుచేసింది.

వెంటనే టి.వి ఆన్‌చేశాడు డాక్టర్ రంగనాథ్.

అందులో డిస్ట్రిక్ట్ పోలీసు కమిషనర్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్నాడు.

"డియర్ సిటిజన్స్ నార్త్‌మూర్ పట్టణానికి ముప్పది మైళ్ళ దూరంలో ఉన్న ఉడ్స్‌లో మంటలు చెలరేగుతున్నాయి. అవి అన్నివైపులా గంటకి సుమారు వందగజాల చొప్పున వ్యాపిస్తున్నాయి. ఫైర్ బ్రిగేడ్‌లు ఆ మంటల్ని ఆర్పడానికి నిర్విరామంగా కృషిచేస్తున్నాయి. కాని వాటిని ఆర్పడం సాధ్యంకావడంలేదు. అందువల్ల ఈ ఉడ్స్‌కి అరవై మైళ్ళ వ్యాసంలో గలవారందరూ తమ స్థావరాలను ఖాళీచేయడానికి సిద్ధంగా ఉండవలసిందిగా కోరుతున్నాం. ప్రజలకోసం బస్‌లను, రైళ్ళను, హెలికాప్టర్‌లను ప్రెస్ చేస్తున్నాం. ఇవి సొంత వాహనాలులేనివారికోసం. అవి ఉన్నవారు సాధ్యమైనంత త్వరగా విలువైన వస్తువులతో దూరంగా వెళ్ళిపోవాలని కోరుతున్నాం" అని చెప్పారు ఆయన.

ఆ తర్వాత టి.వి. అనౌన్సర్ ప్రతి అరగంటకీ ఈ అగ్నిజ్వాలని గురించిన సమాచారం తెలుపుతుంటామనీ, అత్యవసరైతే ఇంకా ముందే తెలియపరుస్తామని ప్రకటించాడు.

డాక్టర్‌రంగనాథ్ ఉన్న ప్రదేశం ఆ డేంజర్ జోన్‌లోనే ఉంది. అంతకన్నా ఆయనని వేధించిన విషయం మరోటుంది. డాక్టర్ కెనెడీ లేబొరేటరీ ఉన్నది ఆ ఉడ్స్‌లోనే. ఆయన ఏమయ్యాడో! ఆయన లేబొరేటరీ ఏమయిందో! అన్నిటినీ మించి ఆ విచిత్రశిల ఏమయిందో! ఆ విషయాలు తెలుసుకోవాన్న ఆత్రం ఎక్కువయింది ఆయనకి.

వెంటనే ముఖ్యమైన కాగితాలు, వస్తువులూ తీసుకుని అక్కడికి 50మైళ్ళ దూరంలో ఉన్న గ్రీన్‌వుడ్ పట్టణానికి బయలుదేరాడు. అక్కడ తన మిత్రుని ఇంట్లో వాటిని భద్రపరిచాడు. ఆ తర్వాత స్థానిక దినపత్రిక "ట్వంటీఫస్ట్ సెంచరీ" ఆఫీసుకి వెళ్ళాడు. అక్కడ న్యూస్ ఎడిటర్‌ని కలుసుకుని తనని పరిచయం చేసుకున్నాడు డాక్టర్ రంగనాథ్. న్యూస్‌కవరేజికి వాళ్ళ ప్రెస్ రిపోర్టర్స్ వెళ్తుంటే వారివెంట తనని కూడా ఆ బర్నింగ్ ఉడ్స్‌కి పంపమని కోరాడు. అందుకు ఆయన ఒప్పుకున్నాడు.

ఆ పత్రికవాళ్ళు ఒక హెలికాప్టర్‌ను సిద్ధం చేశారు. అందులో ప్రెస్ రిపోర్టర్ జాన్, ప్రెస్ ఫోటోగ్రాఫర్ జోన్స్ ఉన్నారు. వాళ్ళకి డాక్టర్ రంగనాథ్‌ని పరిచయం చేశాడున్యూస్ ఎడిటర్.

ఈ ముగ్గురితో హెలికాప్టర్ బయలుదేరింది.

"ఈ పాటికి మీకు ప్రెస్ రిపోర్ట్స్ వచ్చివుంటాయి. ఈ అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో చెప్తారా?" అని అడిగాడు డాక్టర్ రంగనాథ్.

"నిజానికి ఇది అగ్నిప్రమాదం సంభవించాల్సిన ఫారెస్ట్ కాదు. ఇక్కడ ఎక్కువగా తుప్పలు, దుబ్బులే కాని పెద్దపెద్ద చెట్లేవీ లేవు. అటువంటి చోట ఈ ప్రమాదం జరగడం, జ్వాలలు వ్యాపిస్తుండడం విచిత్రంగా ఉంది" అన్నాడు జాన్.

"ఈ ప్రమాదం ఎప్పుడు సంభవించింది" అడిగాడు రంగనాథ్.

"నిన్నరాత్రి సుమారు 12గంటలకు డాక్టర్ కెన్నెడీ లేబొరేటరీ ఉన్న ప్రాంతంలో ముందుగా మంటలు కనిపించాయట. అప్పటినుంచీ ఈ జ్వాలలు విస్తరిస్తూనే ఉన్నాయి. ఆయన లేబొరేటరీలో ఏదైనా కెమికల్ ఎక్స్‌ప్లోడ్ అయిందనుకోడానికి ఆయన జియోఫిజిస్టే కాని కెమిస్టేం కాదు"

ఆ మాట వినగానే డాక్టర్ రంగనాథ్ గుండె గుభిల్లుమంది.

డాక్టర్ కెనెడీ, ఆయన లేబొరేటరీ ఆ మంటల్లో కాలిపోయి ఉండాలి. వాటితోపాటు ఆ విచిత్ర శిల దాని రహస్యం బహిర్గతం కాకుండానే శాశ్వతంగా బూడిదై ఉంటుంది. ఈ హఠాత్పరిణామానికి ఆయన ఎంతో బాధపడ్డాడు.

హెలికాప్టర్ ముందుకి పోతుంటే దూరాన్నుంచే మంటలు కనిపించసాగాయి. హెలికాప్టర్ ఆ మండుతున్న ప్రాంతాన్ని బాగా సమీపించింది.

లాడర్స్ క్రేన్ మొదలైన వాటితో ఫైర్ ఫైటర్స్ ఎంతో ప్రయాసతో నిర్విరామంగా ఆ మంటల్ని ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు.

హెలికాప్టర్ సేఫ్ డిస్టెన్స్‌లో దిగింది.

డాక్టర్ రంగనాథ్, జాన్, జోన్స్ అందులోంచి దిగారు.

ఫొటోగ్రాఫర్ జోన్స్‌కొంచెంసేపు మామూలు కెమేరాతోనూ, మరికొంతసేపు వీడియో కెమెరాతోను ఫొటోలుతీయసాగాడు.

రిపోర్టర్ జాన్ అక్కడి ప్రజలలో డిక్‌థాంప్సన్ అనే ఆయన్ని ముందుగా ఇంటర్వ్యూ చేశాడు.

ఆయన ఈ విధంగా చెప్పాడు.

"మా ఫారం, ఇల్లు ఈ ఉడ్స్‌ని అనుకునే ఉన్నాయి. రాత్రి సుమారు 12 గంటలు అయివుంటుంది. అందరం ఆదమరిచి నిద్రపోతున్నాం. ఉన్నట్లుండి ఫెస్టివల్స్‌లో పేల్చే క్రాకర్ పేలినట్లు శబ్దం అయింది. జనం ఎక్కువగా ఉండేచోట అటువంటి శబ్దం ప్రత్యేకించి వినిపించదు కూడా. కాని అక్కడ జనావాసం బాగా తక్కువగా ఉండి ఎంతో నిశ్శబ్దంగా ఉండడంతో ఆ శబ్దం అంత స్పష్టంగా వినిపించింది. వెంటనే మెలకువవచ్చి చూసేసరికి బయట పట్టపగలును తలపించేటంతటి కాంతి ఉంది. వెంటనే కంగారుగా బయటకు పరుగెత్తి చూస్తే డాక్టర్ కెన్నెడీ లేబొరేటరీ ఉన్న ప్రాంతంనుంచి ఆకాశంలోకి ఎగుస్తూ మంటలు కనిపించాయి. వెంటనే ఫైర్ స్టేషన్‌కి పోలీసుస్టేషన్‌కీ ఫోన్ చేశాం.

"ఈ మంటల్లో మేమొక విచిత్రాన్ని గమనించాం. ప్రేలుడు శబ్దం అయిన కొంతసేపటివరకూ మంటలు నిట్టనిలువుగా లేచినా, ఆ తర్వాత అవి నేలబారుగా వ్యాపించసాగాయి. మామూలుగా అడవులు అంటుకొంటే పచ్చిచెట్లూకూడా కాలుతుంటాయి. కనుక దట్టంగా పొగలు వస్తుంటాయి. కాని ఈ అగ్నిజ్వాలలు పైన ఏ విధమైన పొగాలేదు. మరో విశేషం. సాధారణంగా ఇటువంటి మంటలు ఎర్రగానో పసుపు పచ్చని జ్వాలలుగానో ఉంటాయి. కాని ఈ జ్వాలలు మొత్తం ఒకేరకంగా నీలంగా ఉన్నాయి. కొంతసేపు ఆ విచిత్ర జ్వాలలను చూసి తిరిగివచ్చాం.

"కొంతసేపటికి ఫైర్ ఫైటర్స్ వచ్చారు. వారు ఎంతగా శ్రమించినా ఆ మంటలు అదుపులోకి రాలేదు. పైగా అన్నివైపులా వ్యాపించసాగాయి. దాంతో పోలీస్ సార్జెంట్ ఆ ఉడ్స్‌కి పదిమైళ్ళ దూరంలో ఉండే వారినందరినీ విలువైన వస్తువులతో వెంటనే ఖాళీచేయమని హెచ్చరించారు. మరి కొంచెం సేపట్లోనే రేడియోలలోను, టి.విలలోనూ హెచ్చరికలు వచ్చాయి. ఇక్కడి ప్రజలను ఖాళీ చేయించడానికి ట్రాన్స్‌పోర్ట్‌ను కూడా ఏర్పాటుచేశారు.

"కంగారు కంగారుగా ముఖ్యమైన, విలువైన సామాను తీసుకుని మేము బయటపడ్డాం. ఆ తర్వాత ఆ మంటలు మా ఫారాన్ని కబళించివేశాయి." అంటూ ఆవేదనతో చెప్పాడు డిక్‌థాంప్సన్.

ఈలోగా ఫైర్ బ్రిగేడ్ బాచ్ ఒకటి తిరిగివస్తూ కనిపించింది. వారిని ఆపి తన పరిచయం చెప్పుకొని వారిని ఇంటర్వ్యూ చేయసాగాడు జాన్.

ఆ బ్రిగేడ్ కమాండర్ మాంట్ గోమరీ ఈ విధంగా చెప్పాడు:

"మాకు ఈ ఫైర్ ఆక్సిడెంట్ గురించి రాత్రిచాలా ఫోన్స్‌వచ్చాయి. మా బ్రిగేడ్ ఆ ప్రాంతాన్ని చేరేసరికి ఒంటిగంట అయింది. అప్పటినుంచీ ఎన్నో మోడర్న్ టెక్నిక్స్‌తో గాసెస్‌ని ఉపయోగించీ, కెమికల్స్‌నీ వాడీ

నీటినీ జల్లి ఇలా ఎన్నో విధాలుగా నిర్విరామంగా ఫైట్ చేస్తున్నా ఆ మంటలు చల్లారకుండా వ్యాపిస్తూనే ఉన్నాయి. ఎనిమిది గంటలు పైగా మా బాచ్ పోరాడి అలసిపోయింది. రిలీఫ్ టీం రాగానే మేము తిరిగి వచ్చేస్తున్నాం" అన్నాడాయన ఎంతో మందస్వరంతో.

"ఫారెస్ట్ ఫైర్స్‌ని ఆర్పడం మీకు అలవాటేగా. మరి వీటిని అదుపు చేయలేకపోవడానికి కారణం ఏమిటి?" అని అడిగాడు జాన్.

"నిజమే. ఇంతకన్నా పెద్దమంటల్నే ఆర్పుతాం. కాని ఈ మంటలు చాలా విచిత్రంగా ఉన్నాయి. మేము ప్రత్యేకమైన హీట్ ప్రూఫ్‌దుస్తులు వేసుకుంటాం. వాటివల్ల మాకు మంటల దగ్గరఉన్నా వేడిసోకదు. కాని ఈ మంటల వేడి ప్రత్యేకంగా ఉంది ఎంతో దూరాన ఉన్నాకూడా లోపల్నుంచి ఉడికిపోతున్నట్లనిపిస్తోంది. కొద్ది గంటలలోనే విపరీతమైన అలసట వస్తోంది" అన్నాడు మాంట్‌గోమరీ.

ఆయన ముఖం, ఆయన టీమ్‌లోని వారి ముఖాలు విపరీతమైన అలసటతో వాడిపోయి ఉండడం గమనించాడు జాన్.

"ఈ మంటల్లో ప్రత్యేకత ఏమైనా ఉందా?" అడిగాడు జాన్.

"ప్రతీదీ ప్రత్యేకంగానే ఉంది. మామూలు మంటలు గాలి వాలున్నవైపుగా వ్యాపిస్తాయి. కాని గాలికీ వీటికీ ఎట్టి సంబంధమూ ఉన్నట్లు లేదు. దక్షిణంనుంచి ఉత్తరంవైపుగా విపరీతంగా గాలి వీస్తున్నా, ఈ మంటలు ప్రత్యేకంగా అటువైపు వ్యాపించడంలేదు. అన్ని వైపులకీ ఒకే మాదిరిగా వ్యాపిస్తున్నాయి.

"మామూలుగా అయితే అడవులు తగలబడుటప్పుడు జుయ్యిమని శబ్దం వస్తుంది. ఆకులుకాలుతూ చిటపట శబ్దం చేస్తాయి. కొమ్మలు మండుతూ ఫెళఫెళలాడుతాయి. ఈ మంటల్లో ఇవేవీ లేవు. కేవలం ఒకటే శబ్దం. కెమికల్స్ రియాక్టవుతున్నప్పుడు వచ్చే బుసబుస శబ్దం. ఆకులూ, కొమ్మలూ మండుతూ రాలిపోవడంలేదు. కేవలం వెలుగుగా మారి అదృశ్యం అవుతున్నాయి. అవే కాదు. రాళ్ళూ, ఇళ్ళూ, ఇనుమూ సర్వమూ మంటలు తగలగానే వెలుగుగా మారి అదృశ్యమైపోతున్నాయి. మామూలు అగ్నిజ్వాలలకు భిన్నంగా ఇవి ఉజ్వలమైన నీలికాంతితో ఉన్నాయి. ఇట్టి మంటలు గురించి ఎప్పుడూ వినలేదు, చూడలేదు" అన్నాడు మాంట్‌గోమరీ!

"మీ మోడర్న్ ఫైర్‌ఫైటింగ్ మెథడ్స్‌లో హెలికాప్టర్స్ నుంచి న్యూట్రలైజింగ్ కెమికల్స్‌ని చల్లి మంటలు ఆర్పడం ఉందికదా! అటువంటి ప్రయత్నాలు చేశారా?" అని అడిగాడు జాన్.

"ఆ చేశాం. అవేవీ ఫలించలేదు. అయితే హెలికాప్టర్ టీం ఒక వింత కనుగొంది. మంటలు మొదలైన చోటునుంచి వ్యాపించిన చోటికి గలమధ్య భాగంలో అవంతట అవే ఆరిపోయాయి. అంటే మంటలు ముందుకి వ్యాపిస్తుంటే వెనుకనుంచి అవంతట అవే ఆరిపోతున్నాయి. ఆరిపోయిన భాగంలో నేలతోపాటు ప్రతిదీ నల్లగా మాడిపోయి ఒక విధమైన గంధ్ర ఇసుకగా మారిపోతోంది".

ఈ విషయాలన్నీ ఎంతో ఆసక్తితో విన్నాడు డాక్టర్ రంగనాథ్.

ఇంటర్వ్యూ అయ్యాక "మిస్టర్ జాన్. హెలికాప్టర్‌లో వెళ్ళి మనంకూడా ఈ వింతని చూస్తే బాగుంటుంది కదా. ఇటీజ్ రియల్లీ ఫెంటాస్టిక్" అన్నాడు రంగనాథ్.

"ఓ... ష్యూర్.... దటీజ్ పార్ట్ ఆఫ్ మైడ్యూటీ " అన్నాడు జాన్.

హెలికాప్టరును టేక్ ఆఫ్‌కు సిద్ధం చేస్తుండగా రేడియేషన్ డిటెక్టర్‌ని ఆన్‌చేశాడు డాక్టర్ రంగనాథ్. ఆ ప్రాంతంలో గణనీయమైన రేడియేషన్ ఉన్నట్లు ఇండికేటర్ చూపించింది.

హెలికాప్టర్ మంటలు నిలువుగా గాలిలోకిలేచి ముందుకి దూసుకుపోసాగింది. అందులోని వారందరూ కళ్ళకు ఫిల్టర్ గ్లాసెస్ పెట్టుకుని ఆ మంటల్ని గమనించసాగారు. మంటల్ని సమీపిస్తున్న కొద్దీ రేడియేషన్‌స్థాయి పెరుగుతూ, సూటిగా మంటలమీద అత్యధికంగా ఉన్నట్లు ఇండికేటర్ చూపించింది.

హెలికాప్టర్ ఎత్తుగా ఎగిరిపడుతున్న భాగాల్ని క్రాస్‌చేసి అవలకువెళ్ళింది. మండుతున్న భాగం వెడల్పు పదిమీటర్ల కంటే ఎక్కువలేదు. మంటలు ముందుకి వ్యాపిస్తుంటే వెనుకనుంచి చల్లారడం స్పష్టంగా కనిపిస్తోంది. మంటలు ఆరిపోయిన చోట రేడియేషన్‌స్థాయి అతితక్కువగా ఉండడాన్ని గమనించాడు డాక్టర్ రంగనాథ్.

ఆ ప్రాంతాన్ని కొంతసేపు పరిశీలించి కావలసిన ఫోటోలు తీసుకున్నాక హెలికాప్టర్ తిరుగు ప్రయాణం మొదలుపెట్టింది.

వారుతిరిగి వచ్చేసరికి మంటలు ఇంకాదూరం వ్యాపించాయి. సేఫ్ డిస్టెన్స్‌లో తిరిగి లాండ్ అయింది హెలికాప్టర్.

* * * *

డాక్టర్ రంగనాథ్ మస్తిష్కం ఆలోచనలతో అల్లకల్లోలంగా ఉంది. ఈ జ్వాలలు ఇలాగే సాగితే కొన్నిరోజుల్లో మొత్తం భూమండలమంతా ఏ విధమైన జీవం లేకుండా మాడిమసి అయిపోతుంది. జీవులే కాదు. రాళ్ళు, రప్పలు, నీళ్ళు సర్వమూ నల్లని ఇసుకగా మారిపోతున్నాయి. ఈ మహావిపత్తునుంచి మానవాళిని, సర్వ ప్రపంచాన్నీ కాపాడడం ఎలా?

ఉన్నట్లుండి డాక్టర్ రంగనాథ్ మస్తిష్కంలో ఒక మెరుపు మెరిసింది.

"మిస్టర్ జాన్ ఒక రిక్వెస్ట్. మళ్ళీ మనం ఒకసారి ఆ చల్లారిపోయిన పదార్థం దగ్గరికి వెళ్ళాలి. మన హెలికాప్టర్ అక్కడ లాండ్ అవాలి. ఆ నల్లని పదార్థాన్ని పరిశీలిస్తే ఆ మంటల్ని ఆర్పేమార్గం కనుగొనడం వీలవుతుందని నా నమ్మకం" అన్నాడు.

"నో.... ఐయాం సారీ. మా మిషన్ ఈ ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసి రిపోర్టు చేయడం, ఫోటోలు తీయడం వరకే. మిగిలిన వాటితో మాకేమీ సంబంధం లేదు" అన్నాడు జాన్ కర్కశంగా.

"పోనీ మీ వైర్‌లెస్ ద్వారా హోం డిపార్ట్‌మెంట్‌తో మాట్లాడనీయండి" అన్నాడు రంగనాథ్.

"యుకెన్ డూ దట్" అంటూ అనుమతించాడు జాన్.

వెంటనే డాక్టర్ రంగనాథ్ హోం సెక్రటరీతో మాట్లాడాడు తనకి అర్జెంటుగా హెలికాప్టర్ కావాలని కోరాడు. జాన్ తన హెలికాప్టర్‌ని ఇయ్యలేదని తెలుసుకొని అతన్ని పిలిచి ముక్క చివాట్లు పెట్టాడు హోం సెక్రటరీ.

"యూ ఫెలోస్ యూ థింక్ టూమచ్ ఆఫ్ యువర్ సెల్ఫ్ నీ హెలికాప్టర్‌ను డాక్టర్ రంగనాథ్ అధీనంలో ఉంచు. ఇది నేషనల్ ఎమర్జెన్సీ. దీజ్ ఆర్ మై ఆర్డర్స్, ఇఫ్ యూ డిజోబే ఐ విల్ ప్రాసిక్యూట్ యూ" అని అరిచాడు.

"అలాగే సార్. కాని రిపోర్టింగ్ డిలే అవుతుంది." అంటూ గొణిగాడు జాన్.

"స్టాఫ్ నాన్సెన్స్... ఒక ప్రక్కన ప్రపంచం మండిపోతోంది. నీ బోడి రిపోర్టింగ్ ఎవడికి కావాలి? ఇటీజ్ ఆల్‌రెడీ లేట్. డోన్ట్ వేస్ట్ టైం.... కారీఔట్ మై ఆర్డర్స్" అని గట్టిగా కసిరాడు హోం సెక్రటరీ.

చేసేది ఏమీలేక "హెలికాప్టర్‌ని మీ ఇష్టం వచ్చినంత సేపు వాడుకోండి" అన్నాడు జాన్ ముఖం మాడ్చుకొని.

"మీరూరండి" అన్నాడు రంగనాథ్.

"అవసరం లేదు, నేనూ, జోన్స్ ఇక్కడే వుండి రిపోర్టు రాసుకుంటాం" అన్నాడు జాన్.

ఇదంతా గమనిస్తున్న పైలట్ హెలికాప్టర్‌ని సన్నద్ధం చేయసాగాడు.

* * * *

డాక్టర్ రంగనాథ్ ఆలోచనలన్నీ ఆ వింత శిల చుట్టూనే తిరుగుతున్నాయి. "డాక్టర్ కెనెడీ ఆ శిల అంతరిక్షంనుంచి వచ్చే రేడియేషన్‌ని పీల్చుకుని తిరిగి విడుదల చేస్తోందని చెప్పాడు. అదంతట అదే ఎక్స్‌ప్లోడ్ అయిందో లేదా ఆయన ప్రయోగాలు వికటించి పేలిపోయిందో కాని, అమిత పరిమాణంలో రేడియేషన్‌ని విడుదల చేసింది. మామూలుగా అయితే ప్రేలుడు సంభవించిన చోట సర్వమూ చెల్లాచెదరైపోతుంది. కాని ఇక్కడ కేవలం పశువులు గడ్డిని మేస్తూ ముందుకి సాగినట్లు సర్వాన్ని దగ్ధం చేస్తూ ముందుకి సాగుతోంది. ఈ జ్వాల. ఈ శిల రహస్యం తెలుసుకొంటే డాక్టర్ కెనెడీ చెప్పినట్లు ప్రపంచానికంతటికీ అవసరమైన శక్తిని కొద్ది పదార్థం నుంచే తయారుచేయవచ్చు. కాని ఇప్పుడు ఆ శిలా లేదు. ఆయనా లేరు. నిజంగా ఇది మానవాళి చేస్తున్న దుష్కృతం" బాధగా నిట్టూర్చాడు డాక్టర్ రంగనాథ్.

హెలికాప్టర్ నెమ్మదిగా నేలమీదికి దిగింది.

ఎటుచూసినా నల్లని పదార్థం చిట్లంకట్టిన ఇటుకలాగ ఉంది.

హెలికాప్టర్ దిగి ఆ పదార్థాన్ని కొంచెం చేతుల్లోకి తీసుకున్నాడు రంగనాథ్. అది గట్టిగా ఓ చెంచాడు ఉందో లేదో రెండు మూడు కిలోల బరువున్నట్లు అనిపించి చేయి కిందికి వాలిపోయింది.

ఆ పదార్థాన్ని కొంచెం నలిపిచూశాడు. అది గంధ్ర ఇసుకరేణువులాగా గరగరలాడింది. దానిని ముక్కుదగ్గర పెట్టుకుని చూశాడు. ఏ విధమైన వాసనాలేదు.

"మిస్టర్ పైలెట్. హెలికాప్టర్‌లో స్పేడ్స్ వంటివి ఏమైనా ఉన్నాయా?" అని అడిగాడు రంగనాథ్.

"రెండు షవెల్స్ ఉన్నాయి. సార్" అన్నాడు పైలట్.

"వెంటనే వాటిని తీసుకుని రా. మనం ఈ పదార్థాన్ని సాధ్యమైనంత త్వరలో వీలైనంత ఎక్కువగా హెలికాప్టర్‌లో పోయాలి" అన్నాడు.

ఇద్దరూ ఆ పదార్థాన్ని షవెల్‌తో ఎత్తడం ప్రారంభించారు. అయితే అది విపరీతమైన బరువుగా ఉండడంతో తడవకు కొద్దిగానే ఎత్తగలిగారు. ఆ పదార్థం చాలా బరువుగా ఉండడంతోపాటు, రేడియేషన్ ప్రభావం వల్ల కూడా కావచ్చు. ఓ రెండు పళ్ళికలు పోసేసరికి వారికి చెప్పలేనంతటి అలసట వచ్చింది.

"టెస్టింగ్ కోసం ఇది చాలు. పైలట్, వెంటనే హెలికాప్టర్‌ని బయలుదేరినచోటికి తీసుకుపో" అన్నాడు డాక్టర్ రంగనాథ్.

హెలికాప్టర్ అగ్నిజ్వాలలను సమీపిస్తుండగా "పైలట్.హెలికాప్టర్‌ని అగ్నిజ్వాలల బోర్డరునుంచి ఒక పదిగజాల దూరంలో దించు" అన్నాడు.

హెలికాప్టర్ దిగగానే తాను షవెల్ తీసుకుని బయటకు వస్తూ పైలెట్‌ను కూడా షవెల్‌తో రమ్మన్నాడు రంగనాథ్.

షవెల్‌తో నేలపై అగ్నిజ్వాలకు సమాంతరంగా చారికలాగా తవ్వుతూ "పైలెట్. నువ్వుకూడా షవెల్‌తో రెండో వైపునుంచి ఈ చారికను కొనసాగించు" అన్నాడు.

ఇద్దరూ సుమారు ఇరవై అడుగుల చారికను చేశాక "పైలెట్ ఇంక ఆపు. ఇప్పుడు మనం ఈ పదార్థాన్ని ఈ చారికలో వేయాలి" అంటూ షవెల్‌తో హెలికాప్టర్‌లోకి ప్రవేశించాడు.

పరీక్షల కోసం కొంత పదార్థాన్ని ఉంచి, మిగిలిన దానిని షవెల్‌తో తెచ్చి ఆ చారికలో పోయసాగాడు. పైలెట్‌కూడా ఆయన్ని అనుసరించాడు. పోయడం అయ్యాక "పైలెట్. హెలికాప్టర్‌ను మరో నూరుగజాల దూరం తీసుకుపోయి దించు" అన్నాడు రంగనాథ్.

హెలికాప్టర్ అక్కడ దిగాక బైనాక్యులర్స్ ద్వారా ఆ జ్వాలలను గమనించసాగారు వారిద్దరూ.

మరో అరగంటలో అగ్నిజ్వాలలు ఆ పదార్థం పోసిన చారిక వద్దకు వచ్చాయి.

ఆశ్చర్యం!

చూస్తుండగా ఆ జ్వాలలు ఆ చారిక ఉన్నంతమేరకే వచ్చి కొద్దిసేపట్లోనే ఆరిపోయాయి.

"సక్సెస్. గ్రాండ్ సక్సెస్" అంటూ వైర్‌లెస్ దగ్గరికి పరుగెత్తాడు రంగనాథ్. వైర్లెస్ ఆన్‌చేసి హోం సెక్రటరీతో మాట్లాడాడు.

"సార్.... హేపీన్యూస్... గ్రాండ్‌సక్సెస్. నేననుకున్నట్లు ఆ మంటల్ని ఆర్పగలిగాను. ఇప్పుడు మీ సహాయం వెంటనే కావాలి. ఓ వంద హెలికాప్టర్స్‌ని సాధ్యమైనంత ఎక్కువ మందితో పంపండి. వాళ్ళవెంట స్పేడ్స్, షవెల్స్ ఉండాలి. వాటితో వాళ్ళు ఆ పదార్థాన్ని తవ్వి హెలికాప్టర్‌లో పోయాలి. దానిని తీసుకువెళ్ళి జ్వాలలు వస్తున్న వైపు నేలమీద చారికలు చేసి వాటిలో పోయాలి. ఈ పదార్థం మండి ఆరిపోయింది కనుక ఆ అగ్నివ్యాపించదు. ఇది ఎంత త్వరగా జరిగితే అంత త్వరగా మంటలు ఆరుతాయి."అన్నాడు.

"ఓ.కె" అంటూ ఆ వెంటనే డిఫెన్స్ ఛీఫ్‌తో మాట్లాడాడు హోం సెక్రటరీ. మరో గంటలో ఆకాశంలో కొంగల్లాగా వందకి పైగా హెలికాప్టర్లు ఎగురుతూ వచ్చి రంగంలోకి దిగాయి. చకచకా, మంటలు వ్యాపిస్తున్న అన్నివైపులా నేలలో చారికలు చేసి అందులో ఆ పదార్థాన్ని తెచ్చిపోశాయి.

మరో గంటలో నాలుకలు చాస్తూ కాటేయడానికి వస్తున్న పాములాగా చకచకా వస్తున్న ఆ అగ్నికీలలు

పూర్తిగా ఆరిపోయాయి. వెంటనే ఈ శుభవార్త వైర్‌లెస్‌ద్వారా హోంసెక్రటరీకి చెప్పాడు రంగనాథ్.

ఆయన ఆనందానికి అవధులు లేవు.

"మిస్టర్ రంగనాథ్. యూ ఆర్‌ది మాన్‌హూ సేవ్డ్ అమెరికా అండ్ ది వర్ల్డ్. ది ఎంటైర్ వర్ల్డ్ షుడ్ ఫీల్ ప్రౌడ్ ఆఫ్ యూ" అంటూ పొగిడాడు.

* * * *

కొద్ది రోజులలో అమెరికన్ సైన్స్ కాంగ్రెస్ డాక్టర్ రంగనాథ్‌కి ఘనంగా పౌరసన్మానం జరిపింది. ఆ సందర్భంలో తనకి వచ్చిన ఆలోచనలను వివరించాడు డాక్టర్ రంగనాథ్.

"హెలికాప్టర్ నుంచి ఆ నల్లని పదార్థాన్ని చూసినప్పుడే అది కాలి కాలి ఆరిపోయిన పదార్థం అని గ్రహించాను. ఆక్సిజన్ అందకుండా నిప్పులమీద బూడిదను వేస్తే, అవి ఆరిపోయినట్లు ఈ పదార్థాన్ని ఆ జ్వాలలమీద వేస్తే అవి ఆరిపోతాయనిపించింది.

హెలికాప్టర్‌నుంచి దిగి ఆ పదార్థాన్ని పరీక్షించినప్పుడు, ఒక చెంచాడు పదార్థమే రెండుమూడు కిలోల బరువున్నట్లనిపించింది. అంటే వాటి అణుగర్భంలో ఏదో రియాక్షన్ జరిగిందన్నమాట. పాజిటివ్ ఛార్జి వుండే ప్రోటాన్లు, నెగిటివ్ చార్జివుండే ఎలక్ట్రాన్లు కలిసిపోయి న్యూట్రాన్లుగా మారిపోతాయన్నమాట. అంతేకాక ఈ న్యూట్రాన్లుకూడా దగ్గరగా ఒత్తుకు పోవడంతో విపరీతమైన బరువును పొందింది. ఈ ప్రక్రియలో కొంత పదార్థం రేడియేషన్‌గా మారిపోయింది. ఇది అతి తీవ్రమైనది కావడంతో తగిలిన ప్రతి పదార్థాన్ని దహించివేయసాగింది. ఇది రేడియేషన్ వల్ల వచ్చిన జ్వాల కనుక గాలివాలుతో నిమిత్తం లేకుండా అన్ని వైపులా వ్యాపించింది. ఎప్పుడైతే ఈ పదార్థం రేడియేషన్ ద్వారా ఏర్పడిన బూడిద అని తెలిసిందో వెంటనే దీనిని ఉపయోగించి రేడియేషన్ మూలంగా ఉత్పన్నం అయిన అగ్నిని అణచవచ్చునన్న నమ్మకం కలిగింది. అందుకే ఆ పదార్థాన్ని వ్యాపిస్తున్న జ్వాలవైపు నేలలో గోయి త్రవ్వి అందులో వేశాను. గోయి తవ్వడం వల్ల జ్వాల క్రిందినుంచి వ్యాపించకుండా ఉండిపోయింది. నా నమ్మకం వాస్తవమయింది.

"అయితే ఒక విషయం. విశ్వాంతరాళంలో అధిక ఒత్తిడికి, ఉష్ణానికి గురి అయి ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లు ఒత్తుకుపోయి న్యూట్రాన్లుగా మారిన "న్యూట్రాన్ నక్షత్రాలు" ఉన్నాయి. వీటినే "బ్లాక్‌హోల్స్" అని కూడా అంటారు. కాని భూమిమీద ఇంతటి ఒత్తిడి ఏవిధంగా కలిగిందో అర్థం కావడంలేదు. అయితే కొద్ది రోజులక్రితం డాక్టర్ కెనడీ తనకి ఒక విచిత్రమైన శిల దొరికిందనీ అది అత్యధిక ప్రమాణంలో కాస్మిక్ కిరణాలవంటి వాటిని హరించుకుని తిరిగి తీవ్రమైన రేడియేషన్‌గా విడుదల చేస్తోందనీ చెప్పాడు. దాని రహస్యం కనుగొంటే ప్రపంచానికంతటికీ శతాబ్దాలపాటు సరిపోయే శక్తిని, కొద్దిపాటి పదార్థంనుంచి తయారు చేయవచ్చుననీ, తాను ఆ దిశలో ప్రయోగాలు చేస్తున్నాననీ చెప్పాడు. బహుశా ఆ ప్రయోగం విఫలమై ఈ అనర్థం జరిగివుండవచ్చు. దురదృష్టవశాత్తు ఆయినా, ఆయన లేబొరేటరీ, ఆ శిలాలు అన్నీ దగ్ధమైపోయాయి. నా ఉద్దేశం ప్రకారం ఆ విచిత్ర శిల అంతరిక్షంనుంచి ఉల్కద్వారా భూమిని చేరింది. ఉల్కలను పరిశోధించడంవల్ల మళ్ళీ ఎప్పటికైనా అటువంటి శిలను కనుగొనవచ్చు ననుకొంటున్నాను" అంటూ ముగించాడు.

* * * *

పరిస్థితులు కుదుటపడడంతో అన్నీ మామూలుగా జరగడం మొదలుపెట్టాయి. ఆ రోజు వచ్చిన ఉత్తరాలలో డాక్టర్ కెనడీ వ్రాసిన ఉత్తరం ఒకటి ఉంది. ఆశ్చర్యానందాలతో దానిని తీసుకున్నాడు డాక్టర్ రంగనాథ్. అది ఆ అగ్ని ప్రమాదం జరిగిన రోజునే ఉదయం న్యూయార్క్‌లో పోస్టు అయింది.

అందులో ఇలా ఉంది.

"డాక్టర్ రంగనాథ్

నేను చెప్పిన శిలను చూడడానికి మీరు త్వరలోనే వస్తానన్నారు. ఈలోగా నాకు ఆ శిలను గురించి ఒక ఊహ వచ్చింది. మనకు తెలిసిన అణువులలో ప్రోటాన్లు, ఎలక్ట్రానులు ఉంటాయి. ప్రోటాన్లకు పాజిటివ్ ఛార్జి, ఎలక్ట్రాన్లకు నెగిటివ్ చార్జి ఉంటాయి. ఈ రెండు కలిసిన న్యూట్రాన్‌కి ఏ ఛార్జీ ఉండదు. ఇవన్నీ అందరికీ తెలిసిన సామాన్య విషయాలే. అయితే శాస్త్రజ్ఞులు పాజిటివ్ ఛార్జివున్న ఎలక్ట్రాన్‌ని(పాజిట్రాన్) నెగిటివ్ ఛార్జి ఉన్న ప్రోటాన్‌ని కూడా కనుగొన్నారు. ఈ రెండూ కలిసిన న్యూట్రాన్లు కూడా ఛార్జి లేకుండా ఉంటాయి. ఇటువంటి రెండు రకాల న్యూట్రాన్లు బింబం, ప్రతిబింబంలాగా ఉంటాయి. ఇటువంటివి ఉన్న పదార్థాన్ని "యాంటి మాటర్" అని అంటారని మీకూ తెలుసు. ఈ మాటర్, యాంటీమాటర్ పరస్పరం దగ్గరకి వస్తే అవి పేలిపోయి రేడియేషన్‌గా మారుతాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. నా అభిప్రాయం ప్రకారం నేను కనుగొన్న శిల అంతరిక్షంనుంచి వచ్చే కాస్మిక్ కిరణాలను పీల్చుకుంటుంది. సాట్యురేషన్ పాయింట్ రీచ్ అయ్యాక అది తిరిగి తీవ్రమైన రేడియేషన్‌ని విడుదల చేస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే పాడ్యమినుంచి పౌర్ణమి వరకూ చంద్రుని కాంతి పెరుగుతూ, తిరిగి బహుళ పాడ్యమినుంచి అమావాస్యవరకూ తరుగుతున్నట్లు, దీని రేడియేషన్‌కూడా ఉంటోంది. నా అనుమానం ప్రకారం అది ప్రసారం చేస్తున్న రేడియేషన్ యాంటీమేటర్‌కి సంబంధించింది. దీనిని ధ్రువపరచుకొనేందుకు నేను కాస్మిక్ కిరణాలను లేజర్ కిరణాలుగా మార్చి ఒక ప్రయోగం చేయదలచుకొన్నాను. అయితే ఈ ప్రయోగం విఫలమై పెద్ద ప్రమాదం జరుగవచ్చు. అందులో నా ప్రాణాలు పోవచ్చు. అందుకోసం నాకు దొరికిన శిలలో కొంతభాగాన్ని కోసి న్యూయార్క్‌లోని ఫెడరల్ బ్యాంక్‌లో లాకర్ నంబర్ 999లో ఉంచాను. ఆ లాకర్ కీ ఇందులో పంపుతున్నాను. నేను కనుక చనిపోయే పక్షంలో దానిని మీరు తీసుకుని పరీక్షలు జరుపుకోండి. నా ప్రయోగాలు విజయవంతమైతే వ్యతిరేక లక్షణాలున్న అయస్కాంత ధ్రువాలను ఉపయోగించి మోటార్లను నడపగలగడం వంటి ఎన్నో కార్యాలను నిర్వర్తించినట్లే, మాటర్ యాంటీ మాటర్ల లక్షణాలను ఉపయోగించుకొని అనంతమైన శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. ఈ పరిశోధనలు నేను చేయలేకపోయినా, కనీసం మీరైనా విజయవంతంగా చేయాలని నా కోరిక.

ఉంటాను. అదృష్టం బాగుంటే మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను.

మీ

డాక్టర్ కెనడీ

ఆ ఉత్తరం చదవాగానే బ్రాన్పడిపోయాడు డాక్టర్ రంగనాథ్.

"మీది ఎంతటి ముందుచూపు డాక్టర్ కెనడీ! క్రొవ్వొత్తి ఇతరులకి వెలుగునియ్యడంకోసం తనని హరింపజేసుకొన్నట్లు, ప్రపంచానికి అనంతశక్తిని ఇయ్యడం కోసం మిమ్మల్ని మీరు బలిదానం చేసుకున్నారు. సృష్టి రహస్యాలను బహిర్గతం చేయగల తాళం చెవినొకదానిని మీరు నాకిచ్చారు. దానిని ఉపయోగించి మీరు మొదలు పెట్టిన కృషిని కొనసాగిస్తాను. నేనేకాదు నా వంటి శాస్త్రజ్ఞులు ఎందరో మీ అడుగుజాడల్లో నడుస్తారు. అదే మీకు మేము సమర్పించగలనివాళి" అంటూ మనసులోనే డాక్టర్ కెనడీకి ప్రణమిల్లాడు.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, మే 1987** ✪